
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





# కాంగ్రెస్ వస్తే కరెంట్ ఖతమే

## హస్తం పార్టీ హయాంలో అంతా కరెంట్ కోతలే..

**నాడు విద్యుత్ లేక అన్నదాత అవస్థలు**

**ఇప్పుడు మళ్లీ 3 గంటల కరెంట్ చాలంటూ బూటకం**

**కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని రైతుల ఆగ్రహం**

దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయానికి బీఆర్ఎస్ సర్కారు అందిస్తున్న 24 గంటల కరెంట్ సరఫరాను చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నది. రైతులు సుభిక్షంగా ఉండటాన్ని తట్టుకోలేకపోతున్నది. అందుకే రైతులకు 3 గంటల కరెంట్ చాలని ఆ పార్టీ నేతలు అడ్డగోలుగా వాగుతున్నారు. అంతటితో ఆగకుండా రైతులు 10హెచ్‌పీ మోటర్లు కొనుక్కుంటే సరిపోతుందని ఉచిత సలహాలు ఇస్తున్నారు. దీనిపై రైతులు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. సంతోషంగా ఉన్న అన్నదాతను ఆగం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, 3 గంటల కరెంట్‌తో మూల కూడా తడవదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల నాశనం కోరుకునే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని, ఓట్ల కోసం వస్తే ఉరికించి కొడతామని దుమ్మెత్తిపోస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ)

### 10హెచ్‌పీ మోటర్లతో లోఓల్టేజీ సమస్యలు

అధికారంలోకి వచ్చేందుకు వ్యవసాయంపై అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చుడు సరి కాదు. గత ప్రభుత్వాల హయాంలో లోఓల్టేజీతో మోటర్లు విపరీతంగా కాలిపోయేవి. పండించిన పంట రిపేర్లకే సరిపోయేది. కరెంటు కుడా సరిపడా వచ్చేది కాదు. సీఎం కేసీఆర్ ఉద్యమ సమయంలో రైతుల కష్టాలు చూసి స్వరాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. దాంతో రాష్ట్రంలో వరిసాగు పెరిగింది. కాంగ్రెస్ చెబుతున్న 3 గంటల కరెంటుతో పొలం ఎలా పారుతది. 10హెచ్‌పీ మోటర్లు వాడాలంటున్నారు. వాటిని కొనేందుకు రైతులకు డబ్బులు ఎవరు ఇస్తారు? అలాగే ఇప్పుడు ఉన్న కరెంట్ సరఫరా వ్యవస్థ 10హెచ్‌పీ మోటర్ల సామర్థ్యాన్ని ఎలా తట్టుకుంటాయి? మళ్లీ మోటర్లు కాలడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలడం జరుగుతుంది. కాంగ్రెస్ నాయకుల మాటలు వింటే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురికావడం తప్పదు.

–ఉప్పల గురువారెడ్డి, రైతు, బొమ్మలరామారం



### వ్యవసాయానికి 10హెచ్‌పీ మోటర్లు పనికిరావు

10హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం సాధ్యం కాదు. 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్తే సరిపోతయి. పెద్ద మోటర్లు పెడితే రైతులు నిండా మునుగుడు ఖాయం. ఆర్థిక భారం కూడా పెరుగుతుంది. అప్పుల పాలు కావాల్సిందే. ప్రస్తుతం సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా సాగుతుంది. దాన్ని నాశనం చేయాలని కాంగ్రెస్ నాయకులు చూడడం సరికాదు. సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతిగా మారి రైతులను రాజులను చేస్తున్నడు. అట్లాంటిది వ్యవసాయానికి 3 గంటల కరెంటు సరిపోతదని కాంగ్రెస్ నాయకులు చెప్పడం ఏ మాత్రం సరి కాదు. 10హెచ్‌పీ మోటర్లను వ్యవసాయానికి వినియోగిస్తే భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయం పడావు పడడం ఖాయం. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలు వినకుండా పండుగలా సాగుతున్న వ్యవసాయాన్ని కొనసాగిస్తాం.

–ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి, రైతు, భువనగిరి



### కాంగ్రెస్ మాట వింటే కరెంటుకు కటకటే

పొరపాటున కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు కోసం రేయింబవళ్లు ఎదురుచూడవల్సిందే. గతంలో వారి పాలనలో రైతులు అరిగోస పడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో పంటలకు సరిపడా కరెంటు ఉంది. సీఎం కేసీఆర్ సార్ దూరదృష్టితో కరెంటు కష్టాలు పూర్తిగా తొలిగిపోయాయి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రైతులు చల్లగా బతుకుతున్నరు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వచ్చి అది చేస్తాం, ఇది చేస్తామంటూ మయమాటలు చెప్తున్నారు. వాటిని నమ్మితే మళ్లీ మోసపోతాం. 3గంటల కరెంటు ఇస్తే ఏ మూలన నీళ్లు పారుతాయి. 10హెచ్‌పీ మోటర్‌ను పెట్టుకునే స్థోమత రైతులకు ఉండదు. రైతు రాజ్యం కోసం మళ్లీ కేసీఆరే సీఎం కావాలి.

–సోలిపురం రాంరెడ్డి, రైతు, ఇప్పళ్ల, ఆత్మకూరు(ఎం)



### వ్యవసాయాన్ని చెడగొట్టాలని చూస్తున్నరు

నేను నాలుగెకరాలు కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న కరెంటుతో వ్యవసాయం సాఫీగా సాగుతుంది. పంటలు బాగా పండుతుండడంతో లాభసాటిగా ఉంది. కానీ, రైతులకు 24 గంటల కరెంటు అవసరం లేదు, 3గంటలు సరిపోతదనడం సమంజసం కాదు. 3 గంటలకు పది గుంటలు కూడా పారదు. అంతేకాకుండా 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నరు. అది కూడా కరెక్ట్ కాదు. వ్యవసాయానికి ఎవరు కూడా 10హెచ్‌పీ మోటర్ల వాడరు. అవి పెడితే ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడి పేలిపోయే ప్రమాదం ఉంటుంది. 10ఏండ్లుగా వ్యవసాయం కుదుట పడ్డది. దాన్ని చెడగొట్టాలని చూడొద్దు.

–ముడుగు నర్సింహ, రైతు, పీపల్‌పహాడ్, చౌటుప్పల్





### 10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం చేయలేం

10 హెచ్‌పీ మోటర్ల ద్వారా 3గంటల్లో 3ఎకరాలు పారుతుందని రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు. మా ప్రాంతంలో వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్ ఏ మాత్రం ఉపయోగపడదు. భూగర్భజలాలు ఎక్కువ వచ్చే పరిస్థితి లేదు. 5 లేదా 3హెచ్‌పీ మోటర్ బిగించుకుంటే సరిపోతుంది. రేవంత్‌రెడ్డి తెలిసి మాట్లాడుతుండో, తెలియక మాట్లాడుతుండో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ హయాంలో కరెంటు తిప్పలు తెలియనివి కావు. కరెంటు ఎప్పుడు వచ్చేదో, ఎప్పుడు పోయేదో తెలియని పరిస్థితి ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24గంటల కరెంటుతో పంటలు బాగా పండుతున్నాయి. కాంగ్రెస్ నాయకులు రైతులను మోసం చేస్తేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఆ కుట్రలను రైతులంతా ఛేదించాలి.

–శీలం రాంరెడ్డి, రైతు, రాఘవాపురం, ఆలేరు రూరల్

### కాంగ్రెసోళ్లను నమ్మొద్దు

రైతులు కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు. వారికి ఓటేస్తే ధరణి రద్దు చేస్తామంటున్నారు. ఇలా చేస్తే రైతులకు తిప్పలు తప్పవు. ధరణితో భూమి సమస్యలు లేకుండా పోయాయి. కాంగ్రెస్ వచ్చేది లేదు, సచ్చేది లేదు. ప్రజలు సైతం కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మడం లేదు. వాళ్లు అధికారంలోకి రాకముందు మస్తు చెప్తరు. కానీ, అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయరు. సీఎం కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష. రైతులమంతా కారుకు ఓటేసి ధరణిని కాపాడుకుంటాం. దళారీలను రానీయం.

–రైతు బుడిగె లక్ష్మయ్య, ఆలేరు



### కాంగ్రెసోళ్లు దగాకోర్లు

రైతులు బాగుపడడం కాంగ్రెస్‌కు ఇష్టం ఉండదు. 3గంటల కరెంట్‌తో మా పొలాలు సాగు కావు. ప్రస్తుతం ఇస్తున్న 24 గంటల కరెంటుతో 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లు బాగా పోస్తున్నయ్. కాంగ్రెసోళ్లు 3గంటల కరెంట్ ఇచ్చి 10 హెచ్‌పీ మోటర్లను స్టార్ట్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. రైతులతోపాటు ఇండ్లలో కూడా కరెంట్ కష్టాలు మొదలవుతాయి. కాంగ్రెస్ వస్తే బతుకులు ఆగం కావడం ఖాయం. ఈ పదేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ చేపట్టిన విధానాలతో రైతులమంతా ఆర్థికంగా బలోపేతం అయ్యాం. కాంగ్రెసోళ్లవి దగకోరూ, జూటా మాటలు. ఓట్లు, అధికారమే ధ్యేయంగా కుట్రలు పన్నుతున్నరు. కాంగ్రెసోళ్లను నమ్ముకుంటే వ్యవసాయం బుగ్గిపాలే. మంచి చేసేటోళ్లను వదిలి దొంగలకు కట్టబెట్టొద్దు. వారితో రైతులంతా జాగ్రత్తగా ఉండాలె.

–పరిదె సంతోష్, యువరైతు, రాఘవాపురం, ఆలేరు రూరల్



### రైతులను ఆగం చేసేందుకు రేవంత్ కుట్ర

తెలంగాణ రైతులను ఆగం చేసేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారు. 24 గంటల విద్యుత్‌ను ఇస్తున్న తెలంగాణను కాదని కాంగ్రెస్ అధికరారంలోకి వచ్చాక 3గంటల కరెంట్ ఇస్తామని రైతులను మోసం చేయడమే.10 హెచ్‌పీ మోటర్‌కు ధర ఎక్కువ ఉంటుంది. దానిని కొనే ఆర్థిక పరిస్థితి రైతులకు ఉండదు. అంతేకాకుండా 10హెచ్‌పీ మోటర్లు పెడితే భూగర్భజలాలు ఇంకిపోతాయి. వ్యవసాయానికి ఏ రైతు కూడా ఆ మోటర్లను వాడడు. కాంగ్రెస్ నాయకులు అవగాహన రాహిత్యంతోనే మాట్లాడుతున్నారు.

– చిత్తలూరి నరేశ్, కోటమర్తి , అడ్డగూడూరు



# ధరణి పోతే అరిగోసే..

ధరణి
తెలంగాణ ప్రభుత్వం

## ధరణి స్థానంలో భూమాత పోర్టల్ అంటున్న కాంగ్రెస్

**పాత రెవెన్యూ వ్యవస్థనే తీసుకొస్తామనడంతో రైతుల్లో గుబులు**

**మళ్లీ వీఆర్ఓ నుంచి తాసీల్దార్ వరకు పైరవీలు..**

నల్లగొండ, నవంబర్ 24 : భూమిని అమ్మాలన్నా.. కొనాలన్నా.. ఫౌతీ చేయించాలన్నా.. మ్యూటేషన్ కావాలన్నా.. వీఆర్ఓ నుంచి తాసీల్దార్ వరకు పైరవీలు.. చేయి తడపడాలు.. నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు.. ఇవి ధరణికి ముందు రైతుల కష్టాలు. ధరణి పోర్టల్ వచ్చాక పరిస్థితులు మారి 10 నిమిషాల్లోనే భూ క్రయవిక్రయాలు, మ్యుటేషన్ అవుతున్న నేపథ్యంలో ధరణిని తీసేస్తామిన కాంగ్రెస్ నేతలు చెబుతుండడంతో అన్నదాతల గుండెల్లో గుబులు మొదలైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి రద్దు చేసి, దాని స్థానంలో భూమాత పోర్టల్ పెట్టి పాత రెవెన్యూ వ్యవస్థను కొనసాగిస్తామంటున్న ఆ పార్టీ నాయకుల మాటలతో రైతుల గుండెల్లో రైల్లు పరుగెడుతున్నాయి. ధరణి తీసేస్తే మళ్లీ వీఆర్ఓ నుంచి తాసీల్దార్ వరకు చేతులు తడపడం.. ఆఫీసుల చుట్టూ తిరగడం తప్పదా? అని ఆందోళన చెందుతున్నారు. భూమాత పోర్టల్‌తో రద్దయిన పహాణి మళ్లీ మనుగడలోకి వస్తే పాస్ పుస్తకాల్లో పట్టాదారు స్థానంలో ఒకరు, కబ్జాదారు స్థానంలో మరొకరి పేరుతో గొడవల కారణంగా పోలీస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిందేనా? అని జంకుతున్నారు. దాంతో అలాంటి ప్రభుత్వానికి అవకాశం ఇవ్వొద్దని రైతులు నిశ్చయానికి వచ్చనట్లు తెలుస్తున్నది.



### ధరణి పోర్టల్‌తోనే రిజిస్ట్రేషన్లు సులభం

గతంలో యాదగిరిగుట్ట పట్టణానికి వెళ్లి భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి వచ్చేది. అయితే కొన్నవారు ఒకరోజు ముందుగా వెళ్లి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, చలానాలకు డబ్బులు కట్టి రాయించి పెట్టేది. మరుసటి రోజు సాక్షులను తీసుకెళ్లాల్సి వచ్చేది. దాంతో రైతులకు రెండ్రోజులు వృథా అయ్యేవి. ఈ పనులన్నీ గ్రామాల్లోని కొంతమంది పైరవీకార్లు, మాజీ పట్వారీల అజమాయిషీలో జరిగేవి. ఇవి చేయడంతో వారు దస్తావేజు లేఖరితో కమీషన్లు తీసుకోవడం, అలాగే భూములు కొన్నవారితో సొంత పనులు చేయించుకునేవారు. రిజిస్ట్రేషన్ తదనంతరం వచ్చిన డాక్యుమెంట్లతో తాసీల్దార్ కార్యాలయంలో రికార్డుల మార్పునకు ముడుపులు ముట్టజెప్పాల్సి వచ్చేది. స్వరాష్ట్రంలో రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రైతులకు వరంలా మారింది. ఇప్పుడు తాసీల్దార్ కార్యాలయంలోనే స్లాట్ బుక్ చేసుకోగానే ఇచ్చిన టైమ్‌కు వెళ్తే రిజిస్ట్రేషన్ సులభంగా, వేగంగా అవుతుంది. అలాంటి ధరణిని తీసేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం సరికాదు.

–బుడిగె కొమురయ్య, రైతు, బహుపేట, ఆలేరు రూరల్

### ధరణి రద్దయితే రికార్డులు తారుమారు

కాంగ్రెస్ వాళ్లు ధరణి తీసేస్తాం అంటున్నారు. దాంతో రైతులకు మళ్లీ ఇబ్బందులు తప్పవు. ధరణి తీసేస్తే మళ్లీ పహాణీ, చౌపస్లా రికార్డులన్నీ తారుమారు అయితాయి. పట్వారీల రాజ్యం వస్తుంది. నేడు సీఎం కేసీఆర్ పుణ్యాన భూముల రేట్లు భారీగా పెరిగాయి. ధరణి లేకుంటే పట్వారీలు రికార్డుల్లో ఒకరి భూమిని మరొకరి పేరున రాసి ధోకా చేసే ప్రమాదం ఉంటుంది. ధరణితోనే భూమికి రక్షణ ఉంది. ధరణితో రైతు అనుమతి లేకుండా ఏమీ చేయడానికి వీలు లేదు. ధరణితో 20 నిమిషాల్లోనే భూమి పట్టా అవుతుంది. ఆన్‌లైన్‌లో పహాణీ, 1బీ చూసుకోవడానికి వీలుంటుంది. ఇంతకన్నా రైతుకు ఏం కావాలి. ధరణి కొనసాగాల్సిందే.

–అట్ల రంజిత్‌రెడ్డి, యువరైతు, మాసాన్‌పల్లి, గుండాల





### ధరణి రద్దుతో రైతులు ఆగమే..

సీఎం కేసీఆర్ ధరణి అమలు చేసినంకనే ఈజీగా భూమి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రైతుల భూమికి రక్షణ కలిగింది. భూ రిజిస్ట్రేషన్ కోసం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి వ్యవస్థ బాగుంది. ఇప్పుడు కాంగ్రెసోళ్లు ధరణి ఎత్తివేస్తామంటున్నారు. దాంతో మళ్లీ పాత కష్టాలే వస్తాయి. రైతులకు తీరని నష్టం జరుగుతది. రిజిస్ట్రేషన్ల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడమే కాకుండా పైరవీలు పెరుగుతాయి. కాంగ్రెస్‌వన్నీ పాతకాలపు విధానాలు. వాటితో ఎన్ని ఇబ్బందులు జరిగాయో రైతులందరికీ తెలుసు. అందుకే ఏ రైతు కూడా కాంగ్రెసోళ్ల మాటలను నమ్మరు. కాంగ్రెస్‌ను నమ్మితో నట్టేట ముంచుతారు. సీఎం కేసీఆర్ ఏ ఒక్క రైతుకు నష్టం జరుగకుండా ముందుచూపుతోనే ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. ఈ యాప్‌తో ఏ ఒక్క రైతు నష్టపోలేదు. పటేల్, పట్వారీ వ్యవస్థ తీసుకొచ్చే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందే.

–యాగమాటి వేణురెడ్డి, యువరైతు, అమ్మనబోలు, మోటకొండూర్



### ధరణి రద్దయితే భూములకు భద్రత కరువు

కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి అయ్యాక ధరణి తెచ్చి రైతుల భూములకు భద్రత కల్పించారు. ఇప్పుడు అరగంటలోనే రిజిస్ట్రేషన్లు సులభంగా అవుతున్నాయి. గతంలో భూములు కొనాలన్నా, అమ్మాలన్నా 20 కిలోమీటర్ల దూరంలోని రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వెళ్లాల్సి వచ్చేది. ధరణి వచ్చాక మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలోనే అరగంటలో ఇబ్బందులు లేకుండా అయిపోతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి ఎత్తేస్తామంటున్నారు. ధరణి ఎత్తేస్తే ఎనుకటి కష్టాలు తప్పవు. భూమికి భద్రత కరువవుతుంది. ధరణి ఎత్తేస్తే పట్వారి వ్యవస్థ మళ్లీ ముందుకు వచ్చి గ్రామాల్లో రైతుల మధ్య భూతగాదాలు పెరిగి అశాంతి నెలకొంటుంది. రైతుల మధ్య చిచ్చుపెట్టాలని చూసే కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలి.

–ఇండ్ల మహేశ్, ఎన్‌జీబండల్, తుర్కపల్లి



### ధరణి రద్దుతో మళ్లీ పాతరోజులే..

రైతులు భూమి పట్టాల కోసం తాసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగకుండా ఉండేందుకు సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. గతంలో పట్టా కోసం అధికారులను బతిమిలాడాల్సి వచ్చేది. ధరణి పోర్టల్ కారణంగా భూమి కొనడం, అమ్మడం ఈజీగా జరుగుతున్నాయి. పట్టా నకలు కూడా ఆన్‌లైన్‌లో క్షణాల్లో కొనుగోలు చేసిన వ్యక్తి మీదికి వస్తుంది. ధరణిని రద్దు చేస్తే రైతులకు ఇబ్బంది అవుతది. మళ్లీ పాత రోజులే వస్తాయి. చేతితో రాసే పట్టాలతో అవకతవకలు జరిగి రైతులు గోస పడతారు. ధరణిలో మళ్లీ కౌలు రైతుల కాలం చేరిస్తే పట్టాదారులకు ఇబ్బందులు తప్పవు. వయసు మీద పడి స్వయంగా వ్యవసాయం చేసుకునే రైతులు తమకు ఉన్న కొద్దిపాటి భూమిని కౌలుకు ఇచ్చుకొని దాంతో వచ్చే డబ్బులతో కాలాన్ని గడుపుతున్నారు. కాంగ్రెస్ కౌలు రైతుల కాలం తీసుకొస్తే ఆ భూములను కౌలు రైతులు తమ పేర్ల పైకి మార్చుకునే ప్రమాదం ఉంటుంది. అందుకే ధరణి సేవలను కొనసాగించాలి.

–మామిడాల అంజయ్య, రైతు, కొలనుపాక, ఆలేరు రూరల్